క్లుప్తంగా

పోషణ మాసోత్సవం

చిట్యాల : వెలిమినేడు గ్రామంలోని పీహెచ్‌సీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి ఆరోగ్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం, రక్తహీనత, తల్లి పాల విశిష్టత వంటి అంశాలపై ఏసీడీపీఓ వెంకటమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నర్సింహ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మునుగోడు : గత ఎన్నికల సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశాకే రానున్న ఎన్నికల్లో ఓటర్లను ఓట్లు అభ్యర్థించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మునుగోడులోని సీపీఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి మిర్యాల భరత్ కుమార్, సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు, యసరాని శ్రీను, వేముల లింగస్వామి ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత

చండూరు : జీఓ నంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలు ఏరియర్స్‌తో సహా సెప్టెంబర్ 27లోపు చెల్లించాలని, లేకుంటే ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని పేర్కొంటూ మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం సీఐటీయూ నాయకుడు జెర్రిపోతుల ధనంజయ గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి ముత్తవాని, ఉపాధ్యక్షులు పల్లె కవిత, కట్ట హిందూ, సీత యాదమ్మ, మద్ది లక్ష్మమ్మ పాల్గొన్నారు.

'నల్లగొండ ఎంపీగా అవకాశం వస్తుంది'

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ పార్టీకి 47 సంవత్సరాలుగా సేవలందిస్తున్న తనకు వచ్చే ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం సోనియాగాంధీ కల్పిస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి వల్లె నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యార్థులకు అవగాహన

చండూరు : స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా చండూరు పట్టణంలోని 9వ వార్డు మరియానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ అధికారులు స్వచ్ఛ కార్యక్రమాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ 9వ వార్డు అధికారి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టూటౌన్ : వ్యర్థాల నుంచి అద్భుతమైన వస్తువులను తయారు చేయవచ్చని మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణాచారి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వేస్ట్ టూ వండర్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజలు, యువత, విద్యార్థులకు వేస్ట్ టూ వండర్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యర్థాల నుంచి వివిధ రకాల వస్తువులను తయారు చేయదల్చినవారు ఈ నెల 27 వరకు 9346048760, 8074623855 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. గెలుపొందిన వారికి ఈ నెల 30వ తేదీన సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏసీపీ నాగిరెడ్డి, ఈఈ రాములు, డీఈలు వెంకన్న, అశోక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కేతేపల్లి : లయన్స్ క్లబ్ నకిరేకల్ ఆధ్వర్యంలో కేతేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్, డిస్ట్రిక్ట్ సర్వీస్ చైర్మన్ డాక్టర్ రౌతు వీరబ్రహ్మం సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో గ్రామంలోని 152 మందికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. సుమారు రూ.40వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కమిటీ చైర్మన్లు బొల్లం శోభ కృష్ణమూర్తి, నెమరుగొమ్ముల రామ్మోహన్‌రావు, ఎర్ర శంభులింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అండెం వెంకటేశ్వర్లు, కోశాధికారి వి.నారాయణరెడి పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

మర్రిగూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 35 మంది పేద విద్యార్థులకు యూత్ ఫర్ బెటర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం రూ.30వేల విలువ గల స్కూల్ బ్యాగులు, డిక్షనరీలు, జాతీయ నాయకుల స్టిక్కర్లు, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో సిలివేరు రఘు, పగడాల రఘు, అంజి, శేఖర్, శంకర్, సందేష్, దశరథ్, పవన్, రమేష్, వెంకటేష్, కిశోర్, పాండు, శ్రీకాంత్, మారి శ్రీశైలం పాల్గొన్నారు.

డీజే నిర్వాహకులపై కేసు

కనగల్ : దర్వేశిపురం గ్రామంలో గురువారం రాత్రి నిబంధనలు అతిక్రమించి డీజే నిర్వహించిన పలువురిపై కనగల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దర్వేశిపురం గ్రామంలోని వినాయకుడి విగ్రహం వద్ద నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించి డీజే సౌండ్ పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించిన అభియోగం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తమపై కావాలని కుట్రపూరితంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు

- 10 ఫీట్లలోపు విగ్రహాలు వల్లభరావు చెరువులో..
- ఆపై ఎత్తు విగ్రహాలు చర్లపల్లి భీమ సముద్రంలో నిమజ్జనం
- కంపచెట్ల తొలగింపు, కట్ట వెడల్పు చేయిస్తున్న అధికారులు


భీమ సముద్రం కట్ట వెడల్పు పనులు చేయిస్తున్న అధికారులు


అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్

నల్లగొండ టూటౌన్ : నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీరు లేకపోవడం, ఎడమ కాల్వకు నీరు విడుదల లేని కారణంగా నల్లగొండ పట్టణ సమీపంలోని చర్లపల్లి భీమ సముద్రంలో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి మున్సిపల్ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి సంవత్సరం ఏడెనిమిది ఫీట్ల ఎత్తు ఉన్న విగ్రహాలను ఆర్జాలబావి వల్లభరావు చెరువులో నిమజ్జనం చేసేవారు. అంతకన్నా ఎత్తు ఉన్న విగ్రహాలను హాలియా సమీపంలోని 14 మైలు వద్ద ఎడమ కాల్వలో నిమజ్జనం చేసేవారు. కానీ ఈసారి ఎడమ కాల్వకు నీరు లేకపోవడంతో నల్లగొండ పట్టణ సమీపంలోని చర్లపల్లి భీమ సముద్రంలో నిమజ్జనం చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది.

తొలిసారి భీమ సముద్రంలో..

నల్లగొండ పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన గణేశ్ విగ్రహాలను చర్లపల్లిలోని భీమ సముద్రంలో నిమజ్జనం చేయనున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి సాగర్ ఎడమ కాల్వలో చేసే నిమజ్జనం ఈసారి వర్షాభావ పరిస్థితులు, సాగర్‌లో నీరు లేకపోవడంతో నిమజ్జనం చేసే స్థలం మార్చాల్సి వచ్చింది. హాలియా సమీపంలో చేసే గణేశ్ నిమజ్జనం ఈసారి నల్లగొండ పట్టణ సమీపంలోకి మారింది. గతంలో కూడా ఒకసారి ఇదే పరిస్థితి వచ్చినప్పుడు కూడా అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడాల్సి వచ్చింది. చివరికి దండెంపల్లి సమీపంలోని పానగల్ ఉదయ సముద్రం నుంచి బ్రాహ్మణ వెల్లెంల వెళ్లే కాల్వలో నిమజ్జనం చేశారు. కానీ అక్కడ నిమజ్జనం చేయడానికి అనుకూలంగా లేకపోవడంతో ఈసారి చర్లపల్లి భీమ సముద్రం (చెరువు)ను ఎంపిక చేశారు.

ముమ్మరంగా ఏర్పాట్లు ...

చర్లపల్లిలోని భీమ సముద్రం (చెరువు) వద్ద కట్ట కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కట్ట వెడల్పు కూడా చిన్నగా ఉంది. మున్సిపాలిటీ వారు ఇరిగేషన్ శాఖకు రూ.7.50 లక్షలు ఇచ్చి కట్ట వెడల్పు చేయిస్తున్నారు. కంప చెట్లను, పిచ్చి మొక్కలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించారు. చెరువు వద్ద నిమజ్జనానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను మున్సిపల్ యంత్రాంగం చకచకా చేస్తోంది.

10 ఫీట్ల నుంచి ఆపై ఎత్తు విగ్రహాలు..

నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో 500కు పైగా గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ ప్రాంతంలో 217, టూటౌన్ ప్రాంతంలో 285 వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈసారి ఎక్కువ సంఖ్యలో 10 ఫీట్ల ఎత్తుకుపైగా ఉన్న విగ్రహాలు పెట్టారు. 10 ఫీట్లలోపు విగ్రహాలను పానగల్ బైపాస్ రోడ్డులోని వల్లభరావు చెరువులో నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 10 ఫీట్లకు పైఎత్తు ఉన్న విగ్రహాలను చర్లపల్లిలోని భీమ సముద్రంలో నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మర్రిగూడ బైపాస్ నుంచి చంద్రగిరి విలాస్ మీదుగా వెళ్లి నిమజ్జనం చేయాల్సి ఉంది. ఈ ప్రదేశంలో రోడ్డు వెడల్పు లేని కారణంగా వాహనాలను వన్‌వేలో పంపించి దాసరిగూడెం మీదుగా 12వ బెటాలియన్ నుంచి నల్లగొండకు వాహనాలు చేరుకోనున్నాయి. ఈ రెండ్లు చోట్ల నిమజ్జనం ఏర్పాట్ల కోసం మున్సిపాలిటీ దాదాపు రూ. 35 లక్షల ఖర్చు చేస్తోంది. లైటింగ్, బారికేడ్లు, హెల్త్ క్యాంపు, షిఫ్టుకు 30 మంది చొప్పున మున్సిపల్ సిబ్బంది విధి నిర్వహణలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నాం



సాగర్‌లో నీరు లేని కారణంగా తొలిసారి భీమ సముద్రం వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నాం. విగ్రహాల నిమజ్జనం కోసం వాహనాలను నిలుపుదల చేయడానికి కట్ట వెడల్పు చేసి భారీ క్రేన్‌లు అక్కడ ఉంచుతాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– కేవీ. రమణాచారి, మున్సిపల్ కమిషనర్

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక


కట్టంగూర్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, వార్డు సభ్యులు నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, ఎంపీటీసీ నల్లమాద వీరమ్మ, సూరారపు గణేశ్ పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో బొడ్డుపల్లి సైదులు, నందికొండ సైదులు, వార్డు సభ్యులు అనంతుల యాదయ్య, సున్నపు సైదులు, మేడి కిరణ్, ఇస్తారి, ఎల్లయ్య, మహేష్, పాపయ్య, శంకర్, వెంకన్న ఉన్నారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి

చిట్యాల : గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండల గౌడ సంఘం అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని కులస్తులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీన చిట్యాలలో ఇరవై లక్షల రూపాయల నిధులతో గౌడ సామాజిక వర్గ సంక్షేమ భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగులగడ్డ నర్సింహ గౌడ్, పొన్నం లక్ష్మయ్యగౌడ్, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, కొండ లక్ష్మయ్యగౌడ్, పంతంగి కరుణాకర్‌గౌడ్, మునుకుంట్ల నాగయ్యగౌడ్, పొట్లపల్లి చిన్న స్వామిగౌడ్, బాలగోని రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ సెంటర్ ప్రారంభం

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఆయుష్మాన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమలత, డాక్టర్లు సునీత, కృష్ణవేణి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

చిట్యాల : వెలిమినేడు గ్రామ పరిధిలోని 396, 418 సర్వే నంబర్‌లలో గుట్టలను తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మట్టిని ప్రైవేటు వెంచర్లకు, పరిశ్రమలకు అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మునుగోడు : నియోజకవర్గ కేంద్రమైన మునుగోడును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మునుగోడు మండలంలోని అఖిలపక్ష నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 13వ రోజు శుక్రవారం కొనసాగింది. ఈ దీక్షలో మాదగోని వెంకటేశ్వర్లు, ఐతరాజు సత్యం, నకిరెకంటి రాజు, నరేష్ తదితరులు కూర్చున్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

చండూరు : అంగన్‌వాడీలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం చండూరులో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీ టీచర్లు కేదారి, సునీత, జగదీశ్వరి, విజయనిర్మల, తార, శోభ, నాగమణి, రమణమ్మ, జ్యోతి, రాజేశ్వరి, అనూష, జంగమ్మ, సోని, రాణిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పూల దండలతో నిరసన

నకిరేకల్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు నకిరేకల్‌లో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది పూలదండలు మెడలో వేసుకుని నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు వంటెపాక వెంకటేశ్వర్లు, సంఘం జిల్లా అధ్యక్షురాలు పొడిచేటి నాగమణి, లక్ష్మీ, తరల శోభారాణి, లూర్దు మేరీ, అండాలు, లలిత, లతీఫా, జయమ్మ, అరుణ, సుష్మిత, చంద్రమ్మ, మంగ, కవిత, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్ : మెడలో పూలదండలు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

డిమాండ్లను నెరవేర్చాలి

కేతేపల్లి : అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌కు మార్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు.

● గణేశుడికి పూజలు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. గణనాథుడి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మండపాల్లో కుంకుమ పూజ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


నల్లగొండ : గాంధీనగర్‌లో పూజలో పాల్గొన్న కౌన్సిలర్ బొడ్డుపల్లి లక్ష్మి, యామ కవితాదయాకర్


నకిరేకల్ : కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


కేతేపల్లి : మండపంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


నల్లగొండ : విద్యానగర్‌లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ : పద్మానగర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం : అర్హులైన పేదలకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలని టీ పీసీసీ అధికార ప్రతినిధి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలంలోని తక్కెళ్ళపహాడ్ గ్రామంలో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ తక్కెళ్ళపహాడ్ గ్రామంలో పేదలకు తెలంగాణ ఆవిర్భావానికి ముందు గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అదే స్థలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఇళ్ల స్థలాలను ఇచ్చిన లబ్ధిదారులకు తప్పక డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఇళ్ల స్థలాలు ఇచ్చిన వారికి కాకుండా అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారని అన్నారు. ఆయనవెంట ఆకారం సర్పంచ్, కందాల సమరంరెడ్డి, మాధారంకలాన్ ఎంపీటీసీ నోముల జనార్దన్, కాంగ్రెస్ నాయకులు తీర్పారి మల్లయ్య, కట్టగూరి సురేందర్, చెరుకు జానీ, గూని వెంకటయ్య, బండపల్లి కొమరయ్య, వడ్లకొండ పరమేశ్, నరేష్, మహేశ్, సైదులు, అంజయ్య, వెంకన్న, బీరప్ప, వినయ్, శ్రవణ్, గ్రామస్తులు ఉన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి


చెక్కులు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 11 మంది నిరుపేదలకు మంజూరైన రూ.3 లక్షల 76 వేల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం నల్లగొండలోని తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రం అందించని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రం అందిస్తోందని తెలిపారు. సీఎం సహాయ నిధి వరంలాంటిదని పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్యామ్‌సుందర్, గోపాల్‌రెడ్డి, హన్ను, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల కేంద్రానికి చెందిన నెలగొంద రాషి రాములు, నక్క లింగమ్మ, మార్తినేనిగూడెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఇద్దయ్యలు మృతిచెందారు. కాగా ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక్కో కుటుంబానికి రూ 10 వేల చొప్పున ఆర్థికసాయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందించారు. ఎంపీపీ కరీంపాషా, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డి ఆర్థిక సాయం

కనగల్ మండలంలోని మార్తినేనిగూడెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఇద్దయ్య చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ కోమటిరెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.20వేలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి ద్వారా అందజేశారు. అదేవిధంగా తిప్పర్తి మండలంలో వివిధ కారణాలతో చనిపోయిన మూడు కుటుంబాలకు శుక్రవారం ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్థిక సహాయం చేశారు. బండ్లవారిగూడెంకు చెందిన పిల్లి సైదులుయాదవ్, కంకణాలపల్లికి చెందిన పేర్ల లింగయ్య, జొన్నలగడ్డగూడెం గ్రామానికి చెందిన దూదిపాల ప్రతాపరెడ్డిలు మృతి చెందగా ఒక్కో కుటుంబానికి రూ. 20వేల చొప్పున సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, తిప్పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూకూరి రమేష్, సర్పంచ్ దొంతినేని నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదం.. గణేశ్ విగ్రహ స్థలం


వివాదాస్పద స్థలంలో కూల్చివేసిన సిమెంట్ స్తంభాలు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని శివాలయం సమీపంలో పురాతన గణేశ్ విగ్రహం ఉన్న స్థలం వివాదాస్పదంగా మారింది. ఆ స్థలంలో వెలసిన విగ్రహానికి గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసిన మండపం, రక్షణ స్తంభాలను కొందరు శుక్రవారం కూల్చివేశారు. ఈ స్థలం తమ ఆధీనంలో ఉందని, ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గణపయ్య విగ్రహం ఉన్న స్థలం శివాలయానికి చెందిన భూమి అని భక్తులు సైతం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల వారిని సీఐ రాజశేఖర్ పిలిపించి విచారించారు. 1948 నుంచి గణపతి విగ్రహం ఉన్న స్థలంతో పాటు పక్కనే ఉన్న శివాలయం వరకు మొత్తం 5.10 ఎకరాలు భూమి ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులో ఉన్న పహాణీని పోలీసులకు చూపించారు. మరో వర్గం వారు కూడా తమకు రికార్డులో ఉందని ప్రతులను చూపించారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసేంత వరకు ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయరాదని సీఐ సూచించారు. ఇది ఇలా ఉండగా గణపతి విగ్రహం ఉన్న చోట వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు దాతల సహకారంతో శనివారం 3వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

పురాతన గణపతి విగ్రహం వద్ద పూజలు

నకిరేకల్ పట్టణంలోని శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల సమీపంలో వారం రోజులుగా భక్తుల పూజలు అందుకుంటున్న పురాతన గణపయ్యను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. విగ్రహం చుట్టూ నేలమట్టం చేసిన సిమెంట్ ఇటుకలను పరిశీలించారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


అధికారులతో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ దామోదర్ రావు

చండూరు : అసెంబ్లీ ఎన్నికలకు సెక్టార్ అధికారులు సిద్ధంగా ఉండాలని ఈఆర్‌ఓ దామోదర్‌రావు అన్నారు. శుక్రవారం చండూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సెక్టార్ అధికారి వారికి కేటాయించిన ఎన్నికల పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి కనీస సదుపాయాలపై దృష్టి సారించి నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఏ.రవీందర్‌రెడ్డి, ఎన్నికల ఉప తహసీల్దార్ ఏ.వీ దీపక్‌కుమార్, సెక్టార్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు


అంజిరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు ఎనిమిదేళ్లపాటు హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాకు వెళ్లిన కె.అంజిరెడ్డికి శుక్రవారం ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించి పాఠశాల అభివృద్ధికి అంజిరెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, యాదగిరి రెడ్డి, పాండు, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనగల్ ఎస్‌ఐపై డీఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ క్రైం : కనగల్ మండలంలోని దర్వేశిపురంలో వినాయక మండపాల వద్ద పూజకు వెళ్తున్న క్రమంలో గ్రామస్తులు సౌండ్‌తో స్వాగతం పలికితే వాహనాన్ని అడ్డగించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన ఎస్‌ఐ అంతిరెడ్డి, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ శుక్రవారం నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడం, తన అభిమానుల నివాసాల్లోకి అర్ధరాత్రి వెళ్లి వారి ఫోన్లు లాక్కోవడం, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి బెదిరిస్తున్నట్లు వివరించారు.

భూ వివాదంలో తండ్రిపై కొడుకు దాడి

కేతేపల్లి : భూ వివాదంలో తండ్రిపై కొడుకు దాడి చేసిన ఘటన కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కేతేపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన రావుల సత్యనారాయణ భార్య ఇరవై ఏళ్ల క్రితం చనిపోవడంతో మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు వివాహితులైన కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సత్యనారాయణ పేరు మీద గ్రామంలో ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఇందులో కొంత భూమిని సత్యనారాయణ తన తల్లి భృతి కోసం ఇవ్వగా దానిని మొదటి భార్య కుమారుడు వెంకటేష్ సాగు చేసుకుంటున్నాడు. సత్యనారాయణకు అప్పులు కావడంతో అవి తీర్చేందుకు తన తల్లికి ఇచ్చిన భూమిని విక్రయించాలని నిర్ణయించాడు. దీనికి కుమారుడు వెంకటేష్ అంగీకరించలేదు. ఈవిషయమై కొంతకాలంగా తండ్రీకొడుకులు తగాదా పడుతున్నారు. ఐదు రోజుల క్రితం వ్యవసాయ బావి వద్ద ఎదురుపడగా తండ్రీ కొడుకులు మరోసారి ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో తండ్రి సత్యనారాయణపై కుమారుడు వెంకటేష్ కట్టెతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సత్యనారాయణను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణ రెండో భార్య సుభద్ర శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీలోని తిప్పర్తి రోడ్డులో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ నడికుడి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న భూపతి ఉపేందర్

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో వల్లాల స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలను బీఆర్ఎస్ యువజన నాయకుడు భూపతి ఉపేందర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్‌క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.15016, ద్వితీయ బహుమతి రూ.10016, తృతీయ బహుమతి రూ.8016 తోపాటూ షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు.

ఖుదాబక్షపల్లిలో పిడుగుపాటు

మర్రిగూడ : మండలంలోని ఖుదాబక్షపల్లిలో గురువారం రాత్రి రెండు చోట్ల పిడుగులు పడ్డాయి. అందులో ఒకటి వ్యవసాయ పొలాల వద్ద, మరొకటి ఎండీ.ఖతీజ అనే మహిళ ఇంటి వద్ద పడింది. పిడుగుపాటుకు ఇంట్లోని కొబ్బరిచెట్టు దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని విద్యుత్ వైరింగ్ పూర్తిగా దగ్ధమై ఇల్లు స్వల్పంగా దెబ్బతింది.

ఈకేవైసీ చేయించుకోవాలి

చిట్యాల : రేషన్‌కార్డు లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. చిట్యాల పట్టణంలోని 3, 4వ రేషన్ దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణదారులు ఈ నెల 30వ తేదీ వరకు రేషన్ దుకాణాలను తెరిచి ఉంచాలని, లేనట్లయితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

గడువు పొడిగింపు

మర్రిగూడ : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు మండల కేంద్రంలోని ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి.సుందరయ్య తెలిపారు. వివరాలకు 9440927542 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.